క్లుప్తంగా

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్తుటౌన్ ఎస్‌ఐ జి.వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచిగా లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో అల్లర్లు సృష్టించకుండా, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలు, చేసే పనులపై పోలీసుల నిఘా ఉంటుందని, ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో కేర్ ఆస్పత్రి, హెచ్‌సీజీ ఆస్పత్రి సంయుక్త సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ వై.విజయ ఆదిత్య, డాక్టర్ రాజశేఖర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విజయ ఆదిత్య మాట్లాడుతూ రోజూ 45 నిమిషాలు నడవడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. పాన్‌పరాగ్‌లు, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందన్నారు. శిబిరంలో 164 మందికి బీపీ, ఈసీజీ, బీఎండీ, సీబీసీ, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వీరిలో 76 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులను సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ - 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఎస్.వరప్రసాద్, ఎన్.బుచ్చయ్య, జి.వి జయలక్ష్మి, ఎన్.ప్రకాశరావు, ఎన్.మాధవి పాల్గొన్నారు.

230 మందికి వైద్య పరీక్షలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో అక్షయ హాస్పిటల్, థైరోలాబ్ క్లబ్ అధ్యక్షులు జయతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాకర్స్ కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి పలు సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. సుమారు 230 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు క్లబ్ కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ పాలకవర్గ సభ్యులు జె.రమేష్‌కుమార్, కిషోర్‌కుమార్, ఇమ్మానుయేల్, జాలివాకర్ ఏఎల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కేకే రాజుని కలిసిన ఈశ్వర్



కేకే రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నీలాపు ఈశ్వర్

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కేకే రాజును ఆ పార్టీ నియోజకవర్గ వికలాంగుల విభాగం అధ్యక్షుడు నీలాపు ఈశ్వర్ ఆదివారం కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఈశ్వర్ మర్యాదపూర్వకంగా కేకే రాజును కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

సమస్యల వలయం

ప్రతిష్టాత్మక శ్రీదేవి పార్కును పట్టించుకోని జీవీఎంసీ



కొలనులో నీరు లేక వెలవెలబోతున్న అమ్మవారి విగ్రహం



తుప్పు పట్టి పాడైన ఆట పరికరాలు



జలపాతం లేని పర్వతం



విద్యుత్ దీపానికి చెట్టే ఆధారం

మురళీనగర్ : ఒకప్పుడు **ఆదర్శ పార్కుగా పేరుపొందిన మురళీనగర్‌లోని శ్రీదేవి పార్కు నేడు సమస్యల వలయంలో** చిక్కుకుంది. అభివృద్ధి, పచ్చదనానికి మారుపేరుగా నిలిచిన పార్కు నిరాదరణకు గురైంది. కనీసం విద్యుత్ వెలుగులకు నోచుకోక చీకట్లో కొట్టుమిట్టాడుతోంది. సందర్శకులకు అనువైన వాతావరణం లేక వెలవెలబోతుంది. పార్కులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ''క్రిసిల్'' అవార్డు సాధించి విశాఖ నగర కీర్తి ప్రతిష్టలు చాటిన ఈ పార్కును ప్రస్తుతం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పార్కు నిర్వహణ కమిటీ ఉన్నప్పటికీ నిధుల లేమి వెంటాడుతోంది. జీవీఎంసీ తక్షణమే స్పందించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల విరాళాలతో 2002లో ప్రారంభం

మురళీనగర్ సెక్టార్ - 6లోని శ్రీదేవి పార్కును సుమారు ఎకరం స్థలంలో ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి చేశారు. దీన్ని అప్పటి నగర మేయర్ రాజాన రమణి 2002 మే 25న ప్రారంభించారు. ప్రహరీ గోడ, పార్కులోని పచ్చదనం, ఇతర సౌకర్యాల కల్పనకు 60 శాతం నిధులు నగర కార్పొరేషన్ భరించగా మిగతా 40 శాతం నిధులు **స్థానిక కాలనీ వాసులు విరాళంగా** అందించారు. దీంతో పార్కు అందంగా రూపు దిద్దుకుంది. **శ్రీదేవి కేబుల్ టీవీ అధిపతి, శ్రీదేవి రెసిడెంట్స్** అసోసియేషన్ అధ్యక్షుడు ఇసుకపల్లి రామకృష్ణరాజు దీని అభివృద్ధికి విశేషమైన కృషి చేశారు. పార్కు మధ్యలో ప్రత్యేకంగా కొలను ఏర్పాటు చేసి మధ్యలో శ్రీదేవి (లక్ష్మీదేవి) విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పార్కు తూర్పు వైపున శ్రీకృష్ణుడి విగ్రహం, తటాకం నిర్మించారు. సహజంగా కనిపించే నాగదేవత పుట్ట, ఒక వైపు మూలన పర్వతం నిర్మించారు. అత్యంత సుందరంగా కనిపించే అధునాతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పచ్చదనంతో పార్కు మొత్తాన్ని తీర్చిదిద్దారు. ప్రహరీ గోడ నిర్మించారు. అనంతర కాలంలో రెండు షాపులు నిర్మించి స్వల్ప ఆదాయ వనరులను సమకూర్చారు. ఒక బ్యాంకు సహకారంతో కొన్ని బెంచీలు ఏర్పాటు చేశారు. పిల్లలకు పరిమిత సంఖ్యలో ఆట పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. రామకృష్ణరాజు సహకారంతో పార్కులో వేదిక నిర్మించారు. దీంతో పరిశుభ్రత, బ్యూటిఫికేషన్, పచ్చదనంలో మేటిగా నిలవడంతో విశాఖ నగరంలోనే ఈ పార్కుకు రాష్ట్ర ప్రభుత్వం క్రిసిల్ అవార్డుకు ఎంపిక చేసి 2004లో అందజేసింది.

తక్షణ సహాయం అవసరం

పార్కు పూర్వ వైభవం సంతరించుకోవాలంటే జీవీఎంసీ తక్షణ ఆర్థిక సాయం చేయాల్సి ఉంది. విద్యుత్ సరఫరా వ్యవస్థతోపాటు విద్యుత్ దీపాలను అధునాతనంగా ఏర్పాటు చేయాలి. జంగిల్ క్లియరెన్స్‌కు తక్షణ చర్యలు చేపట్టాలి. నడక మార్గాన్ని నిర్మించాలి. అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనలో భాగంగా ప్రహరీ గోడ ఎత్తు పెంచి రంగులు వేయాలి. పార్కు గేటు నిర్మించాలి. పూర్తి స్థాయిలో మంచినీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటులో భాగంగా కొత్త బోరు నిర్మించాలి. సందర్శకులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట పరికరాలు మంజూరు చేయాలి. ప్రస్తుతం ఉన్న విగ్రహాలు, కళావేదికను అందమైన రంగులతో తీర్చిదిద్దాలి. చెట్లను ప్రూనింగ్ చేసి పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి. అదనంగా షాపులు నిర్మించి ఆదాయ వనరులు పెంచితేనే పార్కు నిర్వహణ సాధ్యమవుతుంది.

నిర్వహణ లేక అంతా అస్తవ్యస్తం

పార్కులోకి ప్రవేశించగానే గత అందాలు కనుమరుగై ప్రస్తుతం అంతా అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. నిర్వహణ లేక ఎక్కడ చూసినా జంగిల్ పెరిగిపోయి, చెత్త పేరుకుపోయింది. అధునాతన విద్యుద్దీపాలు కనుమరుగయ్యాయి. వాటి స్తంభాలు మాత్రమే మిగిలాయి. భూగర్భ విద్యుత్ లైను పూర్తిగా పాడైంది. చివరికి విద్యుత్ దీపాలను చెట్లకు కట్టి వెలిగిస్తున్నారు. ఐరన్ బెంచీలు పాడయ్యాయి. పుట్ట పాడై సిమెంట్‌తో ఏర్పాటు చేసిన నాగుపాము ప్రతిమ విరిగిపోయింది. పర్వతం పాడైంది. శ్రీకృష్ణుడి విగ్రహం కళావిహీనంగా మారింది. ఇక్కడి తటాకం నాచుతో నిండిపోయింది. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన శ్రీదేవి విగ్రహం రంగులు వెలిసిపోయి కొలనులో నీరు లేకుండాపోయింది. బోరు పాడయ్యింది. వాచ్‌మన్ రూము శిథిలావస్థకు చేరుకుంది.





దీపాలు లేని అధునాతన విద్యుత్ స్తంభం



నాచుపట్టిన మురుగునీటి కొలనులో కృష్ణ భగవానుడు



పార్కులో విద్యుత్ దీపం దుస్థితి ఇదీ



పార్కులో కళావిహీనంగా మారిన వేదిక

పార్కులో ఆకతాయిల బెడద నివారించాలి

పార్కులో ఆకతాయిలు రాత్రి పూట గోడ గెంతి లోపలికి ప్రవేశిస్తున్నారు. వీరిని అదుపు చేయడం కష్టమవుతోంది. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించాలంటే గోడ ఎత్తు పెంచాలి. పటిష్టమైన గేటు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వాచ్‌మన్‌కు జీతాలు చెల్లించడం కష్టంగా ఉంది. జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.చంద్రశేఖర్, పార్కు కమిటీ సభ్యుడు

పార్కును అభివృద్ధి చేయాలి

పార్కు దుస్థితిని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా గోడ ఎత్తు చేసి రంగులు వేయడంతోపాటు పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, విద్యుదీకరణ, కొత్తబోరు, సుందరీకరణ, ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ కావాలని కోరాం. ఇటీవల జీవీఎంసీ అధికారులు పార్కును సందర్శించి అంచనాలు తయారు చేశారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేసి పార్కును అభివృద్ధి చేయాలి.

– ఎ.సూర్యనారాయణ, పార్కు కమిటీ అధ్యక్షుడు

గౌరీ సేవా సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బుద్ధ శివాజీ

సీతంపేట : శ్రీగౌరీ సేవా సంఘం (అక్కయ్యపాలెం శాఖ) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం అక్కయ్యపాలెం రామాలయంలో ఘనంగా జరిగింది. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ చేతుల మీదుగా 36 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం అధ్యక్షుడిగా రాజగిరి అప్పలరాజు, గౌరవాధ్యక్షుడుగా పెంటకోట సత్యనారాయణ, కమిటీ చైర్మన్‌గా మళ్ల త్రినాథరావు, కమిటీ వైస్ చైర్మన్‌గా ఆడారి పారుపల్లి రవి, ప్రధాన కార్యదర్శిగా పొలమరశెట్టి ఈశ్వర అప్పారావు బాలు, కోశాధికారిగా పిళ్లా గోపి, కన్వీనర్‌గా పిళ్లా ఫకీర్ నాయుడు, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. 2025 నుంచి 2027 వరకు కొత్త పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు బలరాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు, నాయకులు బొడ్డేటి మోహన్, రాజగిరి సింహాచలం, కొయిలాడ వేణుగోపాల్, ఎల్లపు వేణుగోపాల్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, పి.ఎస్.జె.వి.ప్రసాద్, కర్రి అచ్యుతరావు పాల్గొన్నారు.

అనంతపూర్ టమాటా విక్రయాలు



టమాటా విక్రయాలను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ కిరణ్

సీతంపేట : ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టామని మార్కెటింగ్ శాఖ డీడీ కిరణ్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో టమాటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆయా రైతులు నష్టపోకుండా అనంతపూర్ నుంచి వచ్చిన టమాటాను నరసింహనగర్ రైతుబజార్‌లో ఆదివారం విక్రయించారు. సుమారు టన్ను టమాట బజారుకు రాగా కిలో రూ.12 చొప్పున రైతుబజార్ రైతులు విక్రయించారు. టమాట విక్రయాలను డీడీ కిరణ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు ఆర్.సత్యారాయణ పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజార్‌లో ఆదివారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కిరణ్, అధికారులు అనంతపురం నుంచి వచ్చిన టమాట పరిశీలించారు. ఆ టమాటాలు విక్రయిస్తున్న కౌంటర్లను తనిఖీ చేశారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఊమానీలకంఠేశ్వర ఆలయ వార్షికోత్సవం నేడు



విద్యుత్ దీపాల అలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్ పర్యవేక్షణలో పూజలు నిర్వహిస్తారు. వార్షికోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

గరికపాటి ఆధ్యాత్మిక ప్రసంగం నేడు

మురళీనగర్ : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సోమవారం నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పి.వెంకటసూర్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు పార్కులోని వేములపల్లి కళా ప్రాంగణంలో ఆయన ప్రసంగిస్తారని, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైల్వే న్యూ కాలనీలో వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీలో గల బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 130 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, ల్యాబ్ టెక్నీషియన్స్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వంతో విడదీయరాని బంధం



పుస్తకం ఆవిష్కరిస్తున్న నల్లమోతు రాధాకృష్ణ

సీతంపేట : విశ్వ నియమాలను అవగాహన చేసుకోవడం ద్వారా ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తారని భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘం మహాసభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వతత్వం, పరిణామం అంశంపై ప్రసంగించారు. విశ్వం ఆది అంతాలు లేనిదని, మానవుడు విశ్వంలో విడదీయలేని అంతర్భాగమన్నారు. మనుషులు మతాలు, కులాలు, జాతులు, వర్గాల నుంచి బయటకు వచ్చి హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. పరస్పర సహకారంతో మానవాభివృద్ధి సాధ్యమన్నారు. వైజ్ఞానిక వికాసం పెరగాలని సూచించారు. గుమ్మా వీరన్న రచించిన 'హేతువాద మానవవాద తత్వవేత్త రావుపూడి వెంకటాద్రి' పుస్తకాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి సమీక్షించారు. అనంతరం ఆర్.జగపతిరాజును సంఘం నూతన అధ్యక్షునిగా, ఎస్.పాండురంగారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాజి రాజశేఖర్, రాంప్రభు, షేక్ దరియావలి, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీరామ పట్టాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేకం ఉత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఎన్నడూ లేనంతగా భారీ ఎత్తున ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తవాస్మిదాస బృందం, శ్రీవారి సేవా సమితి, వైశాఖి స్పోర్ట్స్ పార్కు సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు పర్యవేక్షణలో ఉత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం 8.30 గంటలకు కోలాటం, చిన్నారుల భరతనాట్యంతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల విగ్రహాలను ఆశీనులను గావించి పట్టాభిషేక ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంలో దంపతులు పాల్గొని శ్రీరాముడికి అష్టోత్తర నామావళి పూజ, సీతమ్మవారికి కుంకుమ పూజ, ఆంజనేయస్వామికి 108 తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యుల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.